జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 11 | ఏప్రిల్ | 2025 ◆ పేజీలు : 5

# పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

- అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ



**కొత్తగూడెం క్రైమ్, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదును విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పును వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన న్యాయాధికారులు, పోలీసు అధికారులను గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో అభినందించారు. ఇల్లందు మండలం తంగేళ్లగడ్డకు చెందిన భూక్య నాగేశ్వరరావు తన బంధువు కుమార్తెలయిన ఆరు సంవత్సరాల బాలికను, నాలుగు సంవత్సరాల బాలిక చెల్లెలు ఇద్దరిని చాక్లెట్ ఇస్తానని మాయమాటలు చెప్పి 04 జులై 2024 న తన ఇంట్లోకి తీసుకొని వెళ్లి అఘాయిత్యానికి పాల్పడగా వారి అరుపులకు నిందితుడు పారిపోయినాడు. ఇట్టి విషయమై బాలిక తండ్రి, ఇల్లందు పోలీసు

మిగతా 2 లో...




## అసభ్యకర పదజాల ప్రిన్సిపాల్ పై...

2 లో..

# చర్యలేవి..?

- మీ అమ్మ నాన్నల సంతోషానికి మిమ్మల్ని కన్నారంటూ విద్యార్థినిలపై కన్నెర్ర..?
- మీ ఇంటిలో తిండిలేక ఇక్కడ పారేశారు అన్న ప్రిన్సిపాల్
- నేను సమయానికి తెచ్చి పెట్టకపోతే మీరు ఉపవాసం ఉండాల్సిందే అంటున్న ప్రిన్సిపాల్
- హోమోసెక్స్ చేస్తున్నారంటూ విద్యార్థినిలపై వేధింపులు
- అసభ్య పదజాలంతో విద్యార్థినిలపై నోరు పారేసుకుంటున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

◆ చర్ల / భద్రాచలం, ప్రజాజ్యోతి

నేటి బాలలే రేపటి పౌరులు, భవిష్యత్తు భావితరాలదే.... ఇవన్నీ వినడానికి మాత్రమే అన్నట్టుగా భద్రాచలం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులతో అసభ్యకర పదజాలాలు వాడుతూ పిల్లలను భయ భ్రాంతులకు గురి చేస్తూ వారిని నానా ఆవేదనలకు గురి చేస్తున్నటువంటి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చేష్టల పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఏసీబీ వలలో చిక్కిన భద్రాచలం సీఐ

- ఏసీబీ అధికారులతో పట్టుబడ్డ సీఐ వాగ్వివాదం
- ఏడాదిలోనే రెండో ఏసీబీ దాడి

**భద్రాచలం, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** భద్రాచలం పోలీసు స్టేషన్ లో గురువారం ఖమ్మం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి భద్రాచలం సీఐ, స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అయిన బరపాటి రమేష్, ఆయన గన్మెన్ రామారావు, సారపాక గ్రామంకు చెందిన కార్తీక్ అనే వ్యక్తిని అరెస్టు చేసారు. ఏసీబీ ఖమ్మం డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... మార్చి 19న భద్రాచలంలో బూర్గంపాడు లక్ష్మీపురం గ్రామంకు చెందిన ఆవుల వెంకటరామిరెడ్డికి చెందిన లారీలో గ్రావెల్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. ఈ సమయంలో సీఐ గన్మెన్ రామారావు లారీని కేసు లేకుండా వదిలిపెట్టేకుందుకు రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో వెంకట రామిరెడ్డి నా వద్ద డబ్బులు లేవు అని చెప్పినా సరే రూ.20 వేలు అయినా ఇస్తేనే సీఐ గారితో చెప్పి లారీని విడిచిపెడతామని పేర్కొన్నారు. దీంతో వెంకట రామిరెడ్డి రూ.20 వేలను రెడీ చేయగా రామారావు

మిగతా 2 లో...

- ప్రజాపాలనలో కరువైన ఇసుక
- ప్రభుత్వ పనులంటూ సిసి రోడ్ల టోకెన్లు పేరుతో ఘరానా మోసం.!



## పెరిగిన ఇసుక ధరతో భారమైన....

2 లో..

# సొంతింటి కల

**టేకులపల్లి, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** ఇసుక ధర అమాంతం పెరిగిపోయింది. సొంతింటి కల భారమవుతుందని సామాన్యులు వాపోతున్నారు. ప్రభుత్వం తరఫునుంచి ఇసుక క్వారీలు ఏర్పాటు చేయకపోవడం వలన ఇసుక దళారులు దొంగ దారిలో ఇసుక తీసుకువచ్చి 5000 నుంచి 6000 వరకు ఒక ట్రాక్టర్ ఇసుకను అమ్మడం వల్ల సామాన్య బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలమైన మేము సొంతిల్లు నిర్మించుకోవాలంటే ఎంతో భారమైందని ప్రజలు బాధ వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక ట్రాక్టర్ ఇసుక 3000 నుంచి 3500 వరకు ఉన్నటువంటి సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల ఆదేశాల మేరకు ఇసుక ట్రాక్టర్లను ఎక్కడికక్కడే పట్టి వేయడం వల్ల అమాంతంగా

మిగతా 2 లో...

## పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు



(మొదటి పేజీ తరువాయి...)

వారికి ఫిర్యాదు చేయగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అప్పుడు ఇల్లందు డిఎస్పి ఇన్చార్జిగా వ్యవహారిస్తున్న కొత్తగూడెం డిఎస్పి ఎస్కే.అబ్దుల్ రెహమాన్ విచారణ చేపట్టారు. తదనంతరం ఇల్లందు డిఎస్పి చంద్రబాను ధర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినారు. ప్రాసెక్యూషన్ తరపున కోర్టులో 15 మంది సాక్షులను విచారించి, ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరము జడ్జి, భూక్యా నాగేశ్వరరావు పై నేరం రుజువు అయినందున అతనికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఇట్టి కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా కృషిచేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, ఇల్లందు సీఐ సత్యనారాయణ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి, ఇతర అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## ఏసీబీ వలలో చిక్కిన భద్రాచలం సీఐ



(మొదటి పేజీ తరువాయి...)

డబ్బులు నాకు ఇవొవ్వద్దు బూర్గంపాడు మండలం సారపాక గ్రామంకు చెందిన కార్తీక్ అనే వ్యక్తికి ఫోన్ పే ద్వారా పోలీసు స్టేషన్ ఆవరణలోనే ట్రాన్స్ఫర్ చేయించి అనంతరం లారీని విడిచిపెట్టారు. ఈ సంఘటన అనంతరం వెంకటరామిరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించి జరిగిన సంఘటన వివరాలను ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ కు వివరించడంతో వారు. గురువారం భద్రాచలం పోలీసు స్టేషన్ కు వచ్చారు. ఈ సమయంలో వారు తొలుత సారపాకలో కార్తీక్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆనంతరం భద్రాచలం పోలీసు స్టేషన్కు చేరుకున్న ఏసీబీ అధికారులు గన్మెన్ రామారావును, సీఐ బరపాటి రమేష్ ను అదుపులోకి తీసుకొని ముగ్గురిని కలిపి విచారించగా సీఐ సూచనల మేరకే తాను లారీపై కేసు లేకుండా చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు రామారావు అంగీకరించినట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ వివరించారు. అలాగే ఫోన్ పే చేసిన వీడియో సైతం రికార్డు చేయడం జరిగిందని ఏసీబీ డీఎస్పీ రమేష్ వివరించారు. ముగ్గురుని అరెస్టు చేసి ఏసీబీ కోర్డులో హాజరు పరచడం జరుగుతుందని రమేష్ పేర్కొన్నారు.

### నన్ను అన్యాయంగా ఇరికించారు :సీఐ రమేష్

### ఏసీబీ అధికారులతో పట్టుబడ్డ సీఐ వాగ్వివాదం

నా గన్మెన్ చేసిన తప్పుకు నన్ను ఈ కేసులో ఇరికించి అన్యాయం చేస్తున్నారని భద్రాచలం సీఐ బరపాటి రమేష్ విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గన్మెన్ రామారావు తీసుకున్న డబ్బుల అంశంతో తనకు ఎలాంటి సంబంధం లేదు. నన్నెందుకు లాగుతున్నారో నాకు అర్థం కావడం లేదని విలేకరుల ఎదుటే ఏసీబీ డీఎస్పీ, సీఐ బరపాటి రమేష్ ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మీరు కేసు విషయంలో సహకరించాల్సిందేనని ఏసీబీ డీఎస్పీ పేర్కొనగా తనను అన్యాయం చేసి నా జీవితాన్ని ఆగం చేస్తున్నారంటూ సీఐ బరపాటి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దశలో నేను కేసు విచారణకు సహకరించలేనని నన్ను ఇరికించవద్దని ఇదెక్కడి అన్యాయం అంటూ వాపోయారు.

# అసభ్యకర పదజాల ప్రిన్సిపాల్ పై చర్యలేవి..?

**చర్ల/ భద్రాచలం, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** నేటి బాలలే రేపటి పౌరులు, భవిష్యత్తు భావితరాలదే.... ఇవన్నీ వినడానికి మాత్రమే అన్నట్టుగా భద్రాచలం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులతో అసభ్యకర పదజాలాలు వాడుతూ పిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తూ వారిని నానా ఆవేదనలకు గురి చేస్తున్నటువంటి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చేష్టల పట్ల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఒక ఉన్నతమైన హోదాలో ఉన్నటువంటి ఆ ప్రిన్సిపాల్ క్రూరాతి క్రూరంగా విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తున్నటువంటి చేష్టలకు భయపడిన విద్యార్థులు గత నెల 25వ తారీకు నాడు విసుగు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు అంతా ఏకమై బహిరంగంగా ఒక లేఖ ద్వారా విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించగా , అట్టి లేఖను విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా జోనల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అయినప్పటికీ అట్టి ప్రిన్సిపాల్ పై ఎటువంటి చర్యలు చేపట్టకపోగా అధికారులంతా ఒక్కటే అనే కోణంలో దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారేమో? అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

### మీ అమ్మానాన్నల సంతోషానికి మిమ్మల్ని కన్నారు అంటూ

### అసభ్యకరంగా మాట్లాడిన ప్రిన్సిపాల్

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతమైన స్థానాలలో ఉండేలా తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థుల పట్ల బూతు పంచాంగ శ్రవణం వినిపిస్తున్న ఉపాధ్యాయులు( ప్రిన్సిపాల్) ఎందుకలా ప్రవర్తిస్తున్నారో విద్యార్థులకు అర్థం కాక అయోమయ స్థితిలో ఆవేదన చెందుతున్నారు. రేపు రాబోయే సంవత్సరం 10వ తరగతి చదవనున్న విద్యార్థులకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చేష్టలు అత్యంత భయాందోళనలు రేకెత్తించేలా ఉన్నాయంటూ విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద ఆవేదన చెందుతున్నారు.

### మీ ఇంటిలో తిండి లేక మీకు అన్నం పెట్టలేక మిమ్మల్ని ఇక్కడ పారేశారు అన్న ప్రిన్సిపాల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలల అభివృద్ధి కోసం వారి అభ్యున్నతే ధ్యేయంగా వేలకోట్ల రూపాయలు వెచ్చించి కార్పోరేట్ విద్యావ్యవస్థలకు ధీటుగా ప్రభుత్వ వ్యవస్థ కొనసాగాలని విద్యార్థుల కోసం అనేక సొసైటీలను ఏర్పాటుచేసి విద్యార్థులను వారి వారి సంబంధిత సొసైటీలకు సంబంధించిన పాఠశాలల్లో చేరే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహిస్తుండగా, భద్రాచలం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మాత్రం విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ మీకు తిండి పెట్టలేక మీ అమ్మానాన్నలు మా వద్ద మిమ్మల్ని పారేశారు అంటూ, విద్యార్థుల ముందు విచక్షణ కోల్పోయి మాట్లాడుతుండడం పట్ల ఆ పాఠశాల విద్యార్థులు కొంతమంది ధైర్యం చేసి వారి వారి తల్లిదండ్రులకు తెలియజేయగా, అలా తెలియజేసిన విద్యార్థులపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కక్ష సాధింపు చర్యలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### నేను తెచ్చి పెట్టకపోతే మీరు ఉపవాసం ఉండాల్సిందే అంటున్న ప్రిన్సిపాల్

ఫిబ్రవరి 25వ తేదీన పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవర్తనకు విసుగు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థినులు బహిరంగ లేఖ రాయగా వివరాలు తెలుసుకోవడం కోసం ఆ పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులకు చేదు అనుభవం ఎదురయింది. ప్రిన్సిపాల్ తో తల్లిదండ్రులు మీరు విద్యార్థుల పట్ల ఇలా ప్రవర్తిస్తున్నారు అంటూ ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ను ప్రశ్నించగా కోపోద్రిక్తురాలైన ఆ ప్రిన్సిపాల్ అవునండి ఈరోజు నూనె లేదు నేను తెచ్చి పెట్టను ఈరోజు ఈ పిల్లలంతా ఉపవాసం ఉండాల్సిందే అంటూ తల్లిదండ్రులు ఉన్నారన్న భయం కూడా లేకుండా పిల్లలపై కన్నెర్ర చేస్తూ విద్యార్థులతో మాట్లాడిందంటే ప్రిన్సిపాల్ ప్రవర్తన శైలి విద్యార్థుల పట్ల ఏ మేర కొనసాగుతుందో అర్థమవుతుంది.

### హోమో సెక్స్ చేస్తున్నారంటూ విద్యార్థినులపై అబాండాలు వేస్తున్న ప్రిన్సిపాల్

బిడ్డ తప్పు చేస్తే కడుపులో దాచుకోవాల్సిన తల్లిదండ్రుల స్థానంలో ఉన్నటువంటి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కు ఎటువంటి ఓర్పు సహనం లేవని దీనిని బట్టి అర్థమవుతుంది అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపిల్లల పట్ల ఇంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నటువంటి భద్రాచలం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ను తక్షణమే విధుల నుంచి బహిష్కరించాలంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు..

### విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నటువంటి ప్రిన్సిపాల్ పై బహిరంగ విచారణ చేపట్టాలి : తల్లిదండ్రులు

ఉన్నతాధికారులారా..! విద్యార్థినుల పట్ల ఉన్నతమైన హోదాలో ఉండి, విచక్షణా రహితంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న భద్రాచలం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిపి బహిరంగ విచారణ చేయించాల్సిందిగా తల్లిదండ్రులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

## ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుపట్ల హర్షం వ్యక్తం చేసిన-దేవీలాల్ నాయక్



**పాల్వంచ(రూరల్ ), ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి :** భారతదేశంలోనే మొట్ట మొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ఈ విశ్వవిద్యాలయం ప్రస్తుతం అక్కడ ఉన్న మైనింగ్ కాలేజీ ని అప్ గ్రేడ్ చేసి ఏర్పాటు చేయబడుతోంది.ఈ నిర్ణయానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) కూడా జారీ అయ్యాయి.ఈ విశ్వవిద్యాలయం భూమి శాస్త్రాలు (ఎర్త్ సైన్సెస్)పై ప్రత్యేక దృష్టి సారించి విద్య, పరిశోధనలను ప్రోత్సహిస్తుంది.ఇది దేశంలో తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కావడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఖ్యాతి జాతీయ స్థాయిలో పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవీలాల్ ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలిపారు.

# పెరిగిన ఇసుక ధరతో భారమైన సొంతింటి కల

(మొదటి పేజీ తరువాయి...)

ఇసుక రేటు పెరిగిపోయింది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆంక్షల మధ్య అక్రమంగా రవాణ జరగుతున్న ఇసుక పై పోలీసు, అటవీ శాఖ ల నిఘా నేపథ్యంలో నే ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయాయనే సామాన్య ప్రజానికం ఆరోపిస్తున్నారు.

### ప్రజా పాలనలో కరువైన ఇసుక

కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజల వద్దకు పాలన అంటూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పలికిన మాటలు, అధికారంలోకి వచ్చాక సామాన్యుడి సొంతింటి కల నెరవేరలేకుండా పోతుందని సామాన్య ప్రజలు ఆరోపిస్తున్నారు. సిమెంటుకు, ఐరన్ రాడ్లకు విపరీతంగా రేట్లు పెరగడంతో పాటు, మండలాల్లో అందుబాటులో ఉన్నటువంటి వాగులలో, వంకలలో దొరికే ఇసుక సామాన్య గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రజలకు కంచం నిండా అన్నం ఉన్న తినలేని పరిస్థితి అయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇసుకను అతి తక్కువ ధరకు అందించి సామాన్య సొంతింటి కల నిజం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వ పనులంటూ సిసి రోడ్ల టోకెన్ల పేరుతో ఘరానా మోసం

ప్రభుత్వ అభివృద్ధి పనులంటూ ఉచిత ఇసుక బ్యానర్లు పెట్టుకొని 5000 రూపాయలకు స్థానిక టేకులపల్లి ప్రజలకు అమ్ముతున్న అధికారులు పట్టించుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పకడ్బందీగా కట్టడి చేస్తున్నామని అధికారులు తెలుపుతున్న ఇసుక దళారులు భాజాప్తుగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యదేచ్ఛగా ఇసుక అమ్మకాలను జరుపుతున్నారు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఉపయోగించే ముందు మాత్రమే వాటికి బ్యానర్లు టోకెన్ స్లిప్పులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సామాన్య ప్రజలకు సొంతింటి కల నిజం చేయడానికి ప్రభుత్వ అధికా రులు స్వయంగా ఇసుక తోలుకోవడానికి అనుమతులను జారీ చేస్తే అతి తక్కువ ధరకు సామాన్య ప్రజలకు ఇసుక దొరుకుతుందని ప్రజల కోరుతున్నారు.

### టేకులపల్లి ఎస్ఐ పోగులసురేష్ ను ఇసుకపై వివరణ కోరగా :-

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పెట్రోలింగ్ నిర్వహిస్తూ అతి కష్టమైన రాంపులకు కూడా వెళ్లి మరి పట్టుకొని స్వాధీన పరుచుకుంటున్నాం అని ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు.

టేకులపల్లి తహశీల్దార్ ను వివరణ కోరగా... పేద ప్రజలు సొంతిల్లు నిర్మించుకునేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది తరపు నుంచి మీరు నిర్మిస్తున్నటువంటి ఇల్లు గాని, ప్రహరీ గోడ గాని, బాత్రూమ్స్ గాని వాటికి ఎంత ఇసుక పడుతుందని ఒక నమూనా రాపించుకొని మన ఇసుక సైట్ లో అప్లై చేసుకోవాలని వారు తెలిపారు. ఇలా అప్లై చేసుకోవడం వల్ల అతి తక్కువ ధరకు ఇసుక అందుతుందని వారు తెలిపారు.

# ఇల్లందు బస్టాండ్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే






**ఇల్లందు, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** ఇల్లందు ఆర్టీసీ బస్టాండ్ ను గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్ లోని ప్రయాణికులతో ముచ్చటించారు. బస్టాండ్ లోని ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు.బస్టాండ్ లో ఉన్నకార్గో సెంటర్ ను పరిశీలించారు. రోజు ఇక్కడ నుండి వెళ్లే ప్రయాణికుల సంఖ్య కార్గో, పార్సిల్ ఎన్ని తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ సిబ్బంది తో మాట్లాడి బస్టాండ్ పరిస రాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. బస్ స్టేషన్ లో ఉన్న షాపులను పరిశీలించారు. షాపులలో నాణ్యమైన ఆహార వస్తువులు ఉండాలని, కాలం చెల్లిన ఆహార వస్తువులు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాల్స్ లో అదనపురేట్లకు వస్తువులు అమ్మ రాదని ఒకవేళ అలాంటి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం డ్రింకింగ్ వాటర్, ప్లాట్ ఫామ్ లను పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ రాజేష్,సీనియర్ నాయకులు మండల రాము, మడుగు సాంబమూర్తి, మాజీ ఎంపిటిసి పూనెం సురేందర్, డి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనక్ ప్రసాద్ కు సన్మానం



**ఇల్లందు, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** ఐఎన్టీయుసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ను గురువారం ఇల్లందు వచ్చినందున ఏరియా ఐఎన్టీయుసీ సభ్యుడు యండి. షకీర్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, త్యాగరాజన్, జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్, సెంట్రల్ కమిటీ మెంబర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన



**పాల్వంచ (రూరల్), ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, కేశవాపురం జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి) లో గురువారం పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి ఆదేశముల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో వైభవముగా సువర్ణ పుష్పార్చన నిర్వహించబడినది. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించబడినవి. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 12 న దేవాలయంలో చండీ హోమం శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు పౌర్ణమిరోజున నిర్వహించే "చండీ హోమం" తేది:12.04.2025, శనివారం రోజున జరుపబడును. ఈ చండీ హోమం జరిపించుకున్న భక్తులకు అమ్మవారు ఆయు రారోగ్య, అష్టైశ్వర్యములు కలుగచేయును. ఆర్థిక బాధలు తొలగి, సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని వేదాలు చెబుతున్నాయి. ఈ చండీహోమంలో పాల్గొను భక్తులు ముందుగా కాని అదేరోజు గాని రూ.2516.00 చెల్లించి టికెట్ పొంది, మీ గోత్ర నామములు నమోదు చేసుకోవలెను,చండీహోమంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్ర ప్రసాదములతో పాటు ఉచిత అన్నప్రసాదం ఏ ర్పాటు చేయబడును. ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేనివారి పేర సంక ల్పం చేసి హోమం చేయబడును. హోమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తు లు అనగా మగవారు ధోతి, కండువాను ధరించి, ఆడవారు చీర ధరించవలెను,పూర్తి వివరాములకు ఫోన్ : 6303408458 వారిని సంప్రదిచగలరు.

## పిల్లలకు ఇన్ఫెక్షన్ పై అవగాహన



**టేకులపల్లి, ఏప్రిల్10, ప్రజాజ్యోతి:** మండలంలోని ముత్యాలంపాడ్ ఎక్స్ రోడ్డు ఏడబ్ల్యుసి లో పోషణ పక్షం భాగంలో జరిగే ప్రోగ్రాంలో భాగంగా పిల్లలకు ఇన్ఫెక్షన్ రాకుండా పరిశుభ్రతపై గురువారం సిడిపిఓ కెఎండబ్ల్యు తార అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలలో ఇన్ఫెక్షన్ రాకుండా చేతులు కడుకోవాలని సూచించారు. పరిశుభ్రత గురించి తల్లులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం 3 ఏళ్ల పిల్లలకు అక్షరభ్యా సం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సుపర్ ఫైజర్ బి. నిర్మల, ఏడబ్ల్యు టీచర్ పద్మవతి, ఆయా లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 450 మంది నిర్మాణ కార్మికులను ఆర్టిజనులుగా తీసుకోవాలి



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి :** కేటీపీఎస్ 5, ఆరు దశల కర్మాగారం నిర్మాణ సమయంలో పని చేసిన నిర్మాణ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని కేటిపిఎస్ నిర్మాణ కార్మికుల జేఏసీ కమిటీ చైర్మన్ హతీరామ్, వైస్ చైర్మన్ మురళీకృష్ణ, కన్వీనర్ భూక్య లక్ష్మణ్ నాయక్, కో కన్వీనర్ ఏ చంటి లు కోరారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2008 నుండి నిర్మాణంలో పని చేసిన నిర్మాణ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్లో గత 14 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్నామని, అయినప్పటికీ తమ డడిమాండ్లను కేటీపీఎస్ యాజమాన్యం పట్టించుకోకపోవడం విచారకరమన్నా రు. 2008 నుండి నిర్మాణంలో పనిచేసిన కార్మికులను గతంలో 23 వేల మంది ని ఆర్టిజన్లుగా తీసుకున్న సమయంలో కేటీపీఎస్ నుండి 850 మంది తమతో కలిపి నిర్మాణ కార్మికులను ఉండగా 2017లో ఆర్టిజన్ ఇచ్చే సందర్భంలో కేటీపీఎస్ నుండి 1460 మందికి ఆర్టిజన్లుగా గుర్తించారని, కానీ తమకు మాత్రం ఆ సమ యంలో తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా 450 మంది నిర్మా ణ కార్మికులను ఏడోదశ కర్మాగారంలో ఆర్టిజన్లుగా తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల కేటీపీఎస్ కర్మాగా రాన్ని సందర్శించిన జెన్కో సిఎండి నీ కలిసి విన్నవించామని అందుకు స్పందించిన సిఎండి త్వరలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లుగా వారు తెలిపారు. 450 మంది నిర్మాణ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని లేని పక్షంలో తమ జేఏసీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు . ఈ విలేకరుల సమావేశంలో పలువురు నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## నాలుగు లీటర్ల సారా పట్టివేత

- **ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్**

**టేకులపల్లి, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** మండల పరిధిలో ఇద్దరు వ్యక్తుల వద్ద నాలుగు లీటర్ల సారా పట్టుబడినట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని పలు గ్రామంలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద నాలుగు లీటర్లకు నాటు సారాను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంపూర్ణంగా గ్రామాల్లో నాటు సారాను నిర్మూలించుటకు గ్రామస్తుల సహకారం ఉండాలని వారు తెలిపారు. పాత రోజులలో భార్య పుస్తల తాడు అమ్ముకొని పీకలదాకా తాగి కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న రోజులు ఉన్నాయని వారు తెలిపారు. నాటు సారాను తయారుచేసిన రవాణా చేసిన విక్రయాలు జరిపిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ దాడుల్లో రామకృష్ణ గౌడ్, హబీబ్, గురవయ్య, రమేష్, శ్రావణి తదితరా సిబ్బంది పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ హెచ్ఎం గా ఎంపికైన ఆంగోతు వెంకటేశ్వరరావు కు సన్మానం



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డి పల్లి మండల కేంద్రంలో ఉన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంగోతు వెంకటేశ్వరరావు జిల్లా ఉత్తమ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఉండేటి. ఆనంద్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలలో విద్యా సామర్థ్యాలు, విద్యార్థుల సృజనాత్మకత వెలికితీత, విద్యార్థుల సృజనాత్మకత, నాణ్యమైన మధ్యాహ్నభోజన పథకములు, క్రీడాభివృద్ధిని ప్రతి పాఠశాలలకు అందిస్తూ జిల్లాలోని ఉత్తమ కాంప్లెక్స్ గా ఎన్నికైందని జిల్లా కలెక్టర్ మెమొంటో బహుకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సి ఆర్ పి, సి సి ఓ, మిస్ కోఆర్డినేట్స్ పాల్గొన్నారు.

## లోడింగ్ అన్లోడింగ్ కార్మికులను కనీస వేతనాల పరిధిలోకి తీసుకురావాలి

- **టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ షావలి**



**ఇల్లందు, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** సింగరేణిలో పని చేస్తున్న లోడింగ్ అన్లోడింగ్ కార్మికులను కనీస వేతనాల పరిధిలోకి తీసుకురావాలని టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ షావలి కోరారు. గురువారం ఇల్లందుకు వచ్చిన ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. యాకుబ్ షావలి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా సింగరేణిలో కనీస వేతనాలు చట్టబద్ధ హక్కులు అమలుకు నోచుకోని సింగరేణి వేబ్రిడ్జ్ కోల్ లారీ లోడింగ్ అన్లోడింగ్ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి వారికి ఇస్తున్న సౌకర్యాలు సదుపాయాలు అమలు చేయించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సింగరేణి చైర్మన్ లతో మాట్లాడి సింగరేణి వ్యాప్తంగా ఉన్న 47 వేబ్రిడ్జిల వద్ద 1755 కార్మికులకు న్యాయం చేసే విధంగా చూడాలని కోరారు. 1990లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సింగరే ణిలో పనిచేస్తున్న సఫాయి ఎడ్లబండ్ల కార్మికులను గుడ్డు రొట్టె తయారు చేసి పీస్ రేట్ అమ్ముకున్న కార్మికులను టింబర్ యార్డు డిఎల్ఆర్ కార్మికులకు జిఓ నెంబర్ 29 దీని ద్వారా ఆనాడు పర్మనెంట్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కోల్ బెల్ట్ లో ఉన్న మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు, భూపాలపల్లి, రామగుండం, మంచిర్యాల, చెన్నూరులలో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారని, వారితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సమక్షంలో ఈ సమస్యను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. పై సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు యాకూబ్ షావలి తెలిపారు.

## ఆదర్శ కమ్యూనిస్టు మహ్మాద్ రజబ్ ఆలి




**ఇల్లందు, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** ఆదర్శ కమ్యూనిస్టు మహ్మాద్ రజబ్ ఆలి అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య అన్నారు. గురువారం సిపిఐ పట్టణ సమితి ఆద్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ శాసనసభ్యుడు అమరజీవి మహ్మాద్ రజబ్ ఆలి 29వ వర్ధంతి సభ నిర్వహించారు. రజబ్ ఆలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వివిధ నియోజకవర్గాల నుండి 7 సార్లు శాసనసభ్యులుగా ఎన్నికైనారని, ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. ఖమ్మం జిల్లాలో పార్టీ విస్తరణ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారని, బంజారాల అభ్యున్నతికి కోసం విశేషంగా కృషిచేశారని, అందుకే అందరూ లంబాడోల్ల రాందాస్ అని పిలిచే వారన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై స్పందించిన మహనీయులు రజబ్ఆలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేవరకొండ శంకర్, యండి. నజీర్ అహ్మాద్, ఉడుత ఐలయ్య, గుగులోత్ కృష్ణ, అజ్మీరా కిషోర్, వలి, వడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఉంది

- రాష్ట కౌన్సిల్ సభ్యులు జంపన సీత రామరాజు



**కొత్తగూడెం మున్సిపాలిటీ, జీఆర్ బస్తి, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు, 66 బూత్ లలో ఉన్న క్రియా శీలక సభ్యుల సమావేశాన్ని కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట కౌన్సిల్ సభ్యులు జంపన సీత రామరాజు, రాష్ట్ర నాయకులు GVK మనోహర్ రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయవలసిన ఆవశ్యకత పై వివరించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక్ సెల్ అధ్యక్షులు గుమలాపురం సత్యనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షులు MD. సలీమ్, నియోజకవర్గ కన్వీనర్ T.నరేంద్ర బాబు, గుంపుల మహేష్, ఏ. శరత్ యాదవ్, యమునురి శివ, కృష్ణా రెడ్డి, బండారి యాదగిరి, బి వేణు, రాజేష్, పట్టణ క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహాక సమావేశం

- రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా హాజరు



**భద్రాచలం, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** భద్రాచలంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం నియోజకవర్గస్థాయి సన్నాహాక సమావేశం స్థానిక బ్రిడ్జి రోడ్డులో ఉన్న రెడ్డి సత్రంలో ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గంకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో వరంగల్ లో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభకు కావాల్సిన జన సమీకరణ, ప్రచారం, మండలస్థాయి సమావేశాల ఏర్పాటు, ప్రచార సామాగ్రి పంపిణీ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

# ఇల్లందు మనుగడకు ఎలాంటి డోకా లేదు

- గత 10 ఏళ్లుగా సింగరేణిని పట్టించుకున్న వారే లేరు
- తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్





**ఇల్లందు, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియాకు ఎలాంటి డోకా లేదని ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఇల్లందు ఏరియాలోని జెకె 5ఓసిలో జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 ఏళ్ల బిఆర్ఎస్ హయాంలో సింగరేణిని పట్టించుకున్న వారే లేరన్నారు. సింగరేణిలో నూతన గనుల ప్రారంభానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇల్లందు ఏరియాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. 10 ఏళ్లుగా సింగరేణిలో బిఆర్ఎస్ ప్రభుత్వం వల్ల కార్మిక సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని పేర్కొన్నారు. సింగరేణిలో బొగ్గు బ్లాక్ లకు సంబందించిన వేలంపాటలో పాల్గొనకుండా ప్రైవేట్ సంస్థలంటే కెసిఆర్ భినామీలకు వచ్చేలా చేశారని ఆరోపించారు. ఒడిస్సాలోని నైని బొగ్గు బ్లాకులో తట్టెడు మట్టి కూడా తీయకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సహకారంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి ఉత్పత్తి వచ్చేలా చేయటమే కాకుండా థర్మల్ పవర్ ప్లాంట్ వచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడు లేడని అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ చెప్పాడని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 25 వేల మందికి లాభాలలో నుండి రూ. 5వేలను వాటా రూపంలో ఇచ్చామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన కనీస వేతనం సలహా మండలి చైర్మన్ బాధ్యతతో రాష్ట్రంలో ఉన్న కోటి ఇరవై లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతన సవరణ త్వరలోనే పూర్తి అవుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిలో కొత్త గనుల కోసం కృషి చేయడం జరుగుతుందని, అవి వచ్చేలా ఐఎన్టియుసి అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డి నాయత్వంలో సింగరేణి మనుగడ కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్టియుసి నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. త్వరలోనే ఇల్లందు ఏరియాలో జెకె5 ఓసి పొడిగింపు ప్రాజెక్ట్ అయిన పూసపల్లి ప్రారంభం అవుతుందని, అప్పటివరకు ఒక్క కార్మికుడు కూడా ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం జరగదని తెలిపారు. అనంతరం ఐఎన్టియుసి నాయకులు, కార్మికులు జనక్ ప్రసాద్, నరసింహారెడ్డి, త్యాగరాజన్ లను శాలువాలు, గజమాల, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ. కృష్ణ మోహన్ రావు, డీజీయం లను కలిసి జెకె ఓసీ సమస్యలు చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, త్యాగరాజన్, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, రిజినల్ జనరల్ సెక్రటరీలు ఆల్బర్ట్, ఏరియా ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు మహబూబ్, భూక్యా నాగేశ్వరరావు, సీనియర్ ఐఎన్టియుసి నాయకుడు కల్లెం కోటిరెడ్డి, ఫిట్ సెక్రటరీ పడిదల నవీన్ కుమార్, సెంట్రల్ నాయకులు కొండూరి చిన్న, ఈర్య నాయక్, కంకిపాటి రామారావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, ఫిట్ సెక్రటరీ పడిదల నవీన్, ఐఎన్టియుసి నాయకులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## కుల దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించిన విప్లవకారుడు జ్యోతిరావు పూలే

- -సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** అణగారిన వర్గాల కోసం విద్యని ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత, కుల, దోపిడీ రహిత సమాజం కోసం, అణగారిన వర్గాల కోసం విద్యని ఆయుధంగా మలచి ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సిపిఎం 19వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించినవాడు పూలే అని అన్నారు. వెనుకబడిన తరగతికి చెందిన పూలే 1848లో తన స్నేహితుడైన బ్రాహ్మణుని పెళ్ళికి వెళ్ళిన సందర్భంలో వివక్షతకు గురయ్యారని, నాటినుండి సామాజిక వివక్షతులపై కృషి చేశారని అన్నారు. నాడు సమాజంలో నెలకొన్న దురాచారాలకు వ్యతిరేకంగా సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని, స్త్రీ అభివృద్ధి సమాజ అభివృద్ధిగా భావించి ముందుకు నడిచారని అన్నారు. మనువాద సమాజాన్ని తూర్పారబట్టిన సామాజిక ఉద్యమ నేత మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. స్త్రీ విద్య కోసం 1948లో పాఠశాలలో స్థాపించి తన ఇంటి నుండి సావిత్రిబాయి పూలే ను పాఠశాలకు పంపించారని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పని చేశారని, సతీసహగమనాన్ని వ్యతిరేకంగా ఉద్యమించాలని, వితంతువులకు వివాహాలు ప్రోత్సహిస్తూ గొప్ప సంఘసంస్కర్తగా వెలుగొందారని అన్నారు. విద్య ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సత్యశోధక సమాజాన్ని స్థాపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, శాఖ కార్యదర్శి డి రామకృష్ణ, సభ్యులు లక్ష్మీకాంతం, నాగలక్ష్మి, దేవి,రాధా, ఇంద్రజ,శాంతి, గోపాలం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకోసం ఓపెన్ జిమ్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం





**టేకులపల్లి,ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని గోల్యతండా పంచాయతి హైస్కూల్ నందు ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ ను గురువారం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నీ ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ , సీఐ తాటిపాముల సురేష్ , ఎస్సై పోగుల సురేష్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బండ్లరజినీ, మండల నాయకులు ఈది గణేష్, రెడ్యా నాయక్, మంగీలాల్, బండ్ల శ్రీనివాస్, సర్దార్, ఖానా, కోటి, నగేష్, మోహన రావు, చంటి, సరిత, వెంకన్న, సునీల్, వెంకన్న శివాజీ, సుధీప్ పాల్గొన్నారు

# వినతి పత్రాలతో వినకుంటే విజృంభణ చేస్తాం

- ఎం అర్ పి యస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ళ పీరయ్య
- ఎల్ హెచ్ పి యస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్
- ఐటిడిఎ పి ఓ కి వినతిపత్రం అందజేత



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** బయ్యారం మండలం కొత్తపేట శివారు దుబ్బగూడెంలోని 153 సర్వే నెంబర్ లో 6 ఎకరాల ఆక్రమణకు గురైందని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణకు గురైందని ఎం అర్ పి యస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ళ పీరయ్య యల్ హెచ్ పి యస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో రాహుల్ కి వినతి పత్రం అందించారు. అనంత రం వారు మాట్లాడుతూ బయ్యారం మండలం కొత్తపేట శివారు దుబ్బ గూడెం సమీపంలోని కాటమయ్య దేవాలయం సమీపంలో సర్వేనెంబర్ 153 లోని సుమారు 6 ఎకరాల భూమిని, అగ్రవర్ణానికి చెందిన బండి సైదులు బండి నరేష్ గత కొన్ని సంవత్సరాలుగా, కౌలు రూపంలో తీసుకొని యజమానికి బెదిరించి భయభ్రాంతులను చేసి ఆ భూమిని అక్రమించుకున్నాడని, ఆ భూములను ఆక్రమించిన వారి పై చర్యలు తీసుకోవాలన్నారు. బయ్యారం మండల ప్రాంతం ఏజెన్సీ ప్రాంతం, 1/70 చట్టం, పిసా చట్టం ఉన్న అమలు లో వున్న ఆ చట్టాలను తూట్లు పొడుస్తూ, స్థానిక తాహాసిల్దార్ కి అనేకసార్లు దరఖాస్తులు సమర్పించిన, స్థానిక తహాసిల్దార్ పట్టించుకోవడం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఏ కోర్టు, ఆర్డిఓ కోర్టు, హైకోర్టు ఈ భూమి గిరిజనులకే చెందుతుంది అని తీర్పు ఇచ్చింది అని, ఈ తీర్పు వచ్చి 25 సంవత్సరాలు అవుతున్న కూడా స్థానిక తాసిల్దార్ ఆ భూమినీ ఆక్రమించిన అగ్రవర్ణాలకు చెందిన బండి సైదులును బండి నరేష్ లను ఆ భూమి నుండి ఖాళీ చేయించడం లేదని, ఇప్పటికీ 25 సంవత్సరాల అవుతున్న ఎందుకు అగ్రవర్ణాలకు కొమ్ము కాస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. 2016లో కోర్టులు తీర్పులిచ్చిన స్థానిక కోర్టును చట్టాలను మండల రెవెన్యూ అధికారులు ధిక్కరిస్తూన్నారు అని, తహసిల్దార్ పట్టించుకోవడం లేదు అని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిల పేరయ్య ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ తెలిపారు... అధికారులు గనుక ఈ భూమిని స్వాధీనం చేసుకోకపోతే, తమ సంఘాల ఆధ్వర్యంలో భూమిని అక్రమించుకొని పేదలందరికీ గుడిసె లేపించి పేదలకు పంచుతామని అన్నారు. ఇప్పటికైనా స్పందించాలని బయ్యారం మండల తహసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం అర్ పి యస్ జిల్లా సీనియర్ నాయకుడు దేపంగి రమణయ్య మాదిగ, అలవాల పెరియార్ రాజా మాదిగ, తుడుం దెబ్బ నాయకులు,ఎల్ హెచ్ పి ఎస్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా ప్రవీణ్ నాయక్, ఎంఎంఎస్ జిల్లా సీనియర్ నాయకులు మేకల లత, తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎన్ టి ఎస్ లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు

- డిఈఓ వెంకటేశ్వరా చారి



**పాల్వంచ, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి :** పాల్వంచ పట్టణంలోని కాంట్రాక్ట్ కాలనీ కి చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు రెండు రోజుల క్రితం ప్రకటించిన ఐ ఎన్ టి ఎస్ ఓ ఫైనల్ లెవల్లో 96 మంది విద్యార్థులు విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఇందులో ఆరవ తరగతికి చెందిన కోనిక శ్రీ గ్రాండ్ ప్రైజ్ గా లాప్టాప్, ఏడవ తరగతికి చెందిన రిషిత ఫస్ట్ ప్రైజ్ గా టాబ్ సాధించారు. వారితోపాటుగా ద్వితీయ బహుమతి ఒకటి, తృతీయ రెండు, నాలుగవ బహుమతులు రెండు ఐదవ బహుమతి ఒకటి సాధించడం తో పాటుగా మిగతా వారు మెడల్స్ , సర్టిఫికెట్స్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను భద్రాద్రి కొత్తగూడెం డిఈఓ వెంకటేశ్వరా చారి బహుమతులతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం జయప్రకాష్, హై స్కూల్ కోఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపల్ రమ్య , డీన్ మధు, సి ఇన్చార్జ్ నాగబాబు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్యులు

- మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు
- ప్రజల దాహార్తిని తీర్చడమే పంచాయతీల కర్తవ్యం
- ప్రభుత్వ వైద్యులు సంఘమిత్ర రేవంత్





**ఆళ్ళపల్లి.ఏప్రిల్10. ప్రజాజ్యోతి** వేసవిని దృష్టిలో ఉంచుకొని, వైద్యశాలకు విచ్చేస్తున్న రోగులతో పాటుగా, మండల ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా గురువారం చలివేంద్రాన్నీ ఏర్పాటు చేయడం జరిగిందని, స్థానిక ప్రభుత్వ వైద్యులు డిడి, డాక్టర్ సంఘమిత్ర, రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండుటెండల్లోనూ, సుధూర ప్రాంతాల నుండి ఆరోగ్యకేంద్రానికి వస్తున్న రోగులకు. ప్రజలకు చలివేంద్రం ఏర్పాటు చేయడమే వైద్యారోగ్య ప్రధాన కర్తవ్యమని తెలిపారు. మండలంలోని 12 గ్రామపంచాయతీలో గల 44 గ్రామాల్లో నుండి రోజువారీగా గర్భిణీ మహిళలు, వైద్య చికిత్సల కోసం, వడదెబ్బకు గురైన ప్రజలకు, అనివార్య కారణాలతో ప్రమాదాలకు గురైనా రోగులకు, ప్రజలకు, కూలీలకు పాదాచారులకు సైతం సౌకర్యవంతంగా చలివేంద్రం ఏర్పాటుతో త్రాగునీరు మంచినీటి సదుపాయాన్ని కల్పించడం జరిగిందన్నారు. మండు టెండల్లోని వైద్యశాలకు, మండల వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విచ్చేస్తున్న ప్రజానీకానికి, ప్రజాసేవే తమ ప్రధాన లక్ష్యంగా భావించి, చలివేంద్ర ఏర్పాటును చేయడం జరిగిందని గుర్తు చేశారు. వైద్య కేంద్రంలోని చలివేంద్రం మంచినీటి సౌకర్యాన్ని రోగులు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సంఘమిత్ర విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, సూపర్వైజర్ సులోచన, మొబైల్ సిబ్బంది నరేష్, ఎల్టి పార్వతి, స్టాఫ్ నర్స్ ఆశ వర్కర్లు తదితెరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ చలో గామ్ చలో బస్తి కార్యక్రమం



**ఆళ్ళపల్లి.ఏప్రిల్10. ప్రజా జ్యోతి** బిజెపి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు, మండల వ్యాప్తంగా రోజు వారీగా పైలట్ గ్రామాన్నించుకొని గడపగడపకు తిరుగుతూ బిజెపి పార్టీ బలుపేతానికి కృషి చేయాలనే లక్ష్యంతో చలో గామ్ చలో బస్తి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాసాచారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని అంగన్వాడి, ప్రభుత్వ వైద్యశాల, రామాలయ దేవాలయం పలు ప్రదేశాలను పరిశీలించి, స్థానిక ప్రజలను అక్కడి స్థితి గతులను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షులు పూణెం వెంకటేష్ ప్రధాన కార్యదర్శి కొమరం లక్ష్మయ్య పూనం రాంబాబు యూత్ అధ్యక్షులు గొగ్గెల రాంబాబు. బొమ్మల జనార్ధన్ పాల్గొనడం జరిగింది.

# పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

- ధరలు పెంచి పేదలపై భారాలు మోపిన మోడీ గద్దె దిగాలి
- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం టౌన్,ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, సిపిఎం,సిపిఐ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఖాళీ సిలిండర్లను ఉంచి, మహిళలు కట్టెల పొయ్యిని వెలిగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి సిపిఐ పట్టణ నాయకులు మా రెడ్డి శివాజీ సిపిఐ ఎమ్మెల్యే మాస్ లైన్ జిల్లా నాయకులు కెచ్చల కల్పనలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు కాపాడుతూ వారికి అనుకూలమైన విధానాలు అమలు చేస్తోందని, పేదలపై భారాలు మోపుతోందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధర తగ్గినప్పటికీ భారతదేశంలో మాత్రం బిజెపి ప్రభుత్వం గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ విధానాల వల్ల రోజు, రోజుకు నిరుద్యోగం, పేదరికం అసమానతలు తీవ్రమవుతున్నాయని, ఉపాధి అవకాశాలు దెబ్బతినడంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్న బిజెపిని గద్దె దించటానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పార్టీ సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ నాదెళ్ల లీలావతి టౌన్ కమిటీ సభ్యులు యు జ్యోతి కనక శ్రీ కుంజా శ్రీనివాస్ ధనకొండ రాఘవయ్య సిపిఐ నాయకులు నాయుడు,మహేష్,శ్రీనివాస్, కుమారి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు శివ, సాయన్న తదితరులు పాల్గొన్నారు..